నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 2 జూన్ 2025 | SIDDIPET

కనకయ్య కుటుంబానికి చెక్కును అందచేస్తున్న హరీశ్‌రావు

కార్యకర్తలకు అండగా ఉంటాం

- హామీలతో కాలం వెళ్లదీస్తున్న కాంగ్రెస్
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి రూ.5లక్షల చెక్కు అందజేత

వర్గల్, జూన్ 1: బీఆర్ఎస్ కార్యకర్త ఏ ఒక్కరికి ఆపద వచ్చినా పార్టీ అన్నివేళలా అండగా ఉంటుందని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం వర్గల్ మండలం తున్కిమక్తా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చాకలి కనకయ్య కుటుంబానికి కేసీఆర్ ఆదేశాలతో రూ.5లక్షల చెక్కును హరీశ్‌రావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్కతుర్తిలో నిర్వహించిన సభ చరిత్రలో నిలిచి పోతుందన్నారు. ఎల్కతుర్తి సభలో పాల్గొని ఇంటికి బయలుదేరిన బీఆర్ఎస్ కార్యకర్త చాకలి కనకయ్య తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించడం బాధ కలిగించిందన్నారు.మృతుడి కూతుర్లు అన్విక, శాన్వికను మంచి పాఠశాలలో చదివించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. మృతుడి కుటుంబానికి ఇల్లు కట్టిస్తామన్నారు.కాంగ్రెస్ అలవికాని హామీలిచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. గజ్వేల్‌లో రూ.30 కోట్లతో నిర్మించిన మాతాశిశు కేంద్రాన్ని ఇప్పటి వరకు వినియోగంలోకి తేకపోవడం దారుణమని అన్నారు. జహీరాబాద్ ఏరియా దవాఖానలో సెల్‌ఫోన్ లైట్ వెలుతురులో రోగులకు చికిత్స చేయడం కాంగ్రెస్ అసమర్థ పాలనకు అద్దం పడుతున్నదని హరీశ్‌రావు విమర్శించారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బాలుయాదవ్ పాల్గొన్నారు.

బడిబాట తర్వాతే టీచర్ల సర్దుబాటు చేయాలి

- జీవోను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలి
- పీఆర్టీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాణయ్య

అందోల్, జూన్ 1: బడిబాట కార్యక్రమం తర్వాతనే జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని పీఆర్టీయూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాణయ్య ఆదివారం ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈనెల 6నుంచి నిర్వహించనున్న బడిబాట కార్యక్రమం పూర్తికాకముందే ప్రస్తుత డైస్ సంఖ్య ఆధారంగా 13లోపు పాఠశాలల్లో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని, ఇది ఉపాధ్యాయులు, విద్యావ్యవస్థను అయోమయానికి గురిచేస్తుందని పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమం పూర్తయితే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, అప్పుడు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో 60మందికి ఇద్దరే టీచర్లు, 90మందికి ముగ్గురు టీచర్లు అని ఉత్తర్వులు ఇవ్వడం సరైన విధానం కాదని, ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడు, ఐదు తరగతులకు ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పుడే నాణ్యమైన విద్య అందుతుందని, దీనిని గుర్తించి ప్రభుత్వం జీవోను వెనక్కి తీసుకోవాలని ఆయన కోరారు.


తీగుల్‌లో హరీశ్‌రావును గజమాలతో సన్మానిస్తున్న తీగుల్ యువసేన యూత్ సభ్యులు


సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం తీగుల్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

ఉద్యమాల పురిటిగడ్డ తీగుల్

ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిన పల్లె ఇది..

- రాష్ట్రంలో సొంత డబ్బులతో పార్టీ కార్యాలయం ఏర్పాటు చేసుకున్న మొదటి గ్రామం తీగుల్..
- తెలంగాణ రాష్ట్రానికే ఆదర్శం
- కేసీఆర్ పాలనలో సస్యశ్యామలం.. రేవంత్ హయాంలో బతుకులు ఆగం
- కాంగ్రెస్ అంటేనే మోసం
- బీఆర్ఎస్ హయాంలో పార్టీలకతీతంగా పథకాలు అమలు
- కాంగ్రెసోళ్లకే పథకాలు ఇస్తున్న రేవంత్
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- తీగుల్‌లో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ
- యువసేన యూత్ ఆధ్వర్యంలో హరీశ్‌రావుకు గజమాలతో సన్మానం

జగదేవపూర్, జూన్ 1 : తెలంగాణ రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా సొంత డబ్బులతో స్థలం కొనుగోలు చేసి బీఆర్ఎస్ కార్యాలయం నిర్మించుకున్న ఏకైక గ్రామం తీగుల్ అని, ఈ గ్రామం యావత్ రాష్ట్రానికి, బీఆర్ఎస్‌కు ఆదర్శం అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని తీగుల్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సొంతంగా నిర్మించుకున్న బీఆర్ఎస్ కార్యాలయం, తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆదివారం హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వేలేటి రాధాకృష్ణ శర్మతో కలిసి హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. తీగుల్ గ్రామం గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. ఇక నుంచి ఏ గ్రామానికి వెళ్లినా తీగుల్ ప్రస్తావనా తీసుకొస్తానన్నారు. ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ కార్యాలయాలు నిర్మించుకోవాలని, అందుకు ఆదర్శంగా తీగుల్‌ను తీసుకోవాలని సూచిస్తానన్నారు. తీగుల్ గ్రామం 2001 నుంచి తెలంగాణ ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచిందని గుర్తుచేశారు. 2001 లో గ్రామంలో పార్టీ కార్యాలయం కోసం జాగ కొనుగోలు చేశారని, నేడు రజతోత్సవ వేళ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని హరీశ్‌రావు అన్నారు. కార్యకర్తలు సొంత డబ్బులు వేసుకొని పార్టీ భవనం నిర్మించుకోవడం ఆదర్శం అన్నారు. తీగుల్‌కు గొప్ప చరిత్ర ఉందని, రజాకార్లకు ఎదురొడ్డి పోరాడిన గ్రామం తీగుల్ అని, 1969లో తొలిదశ తెలంగాణ ఉద్యమంలో ఈ గ్రామం ముందు వరుసలో ఉన్నట్లు గుర్తుచేశారు. గ్రామానికి చెందిన కుమ్మరి బాలయ్య, మల్లారెడ్డి వంటి వారు జైతెలంగాణ అని నినదించినట్లు తెలిపారు. నేడు వారిని యువసేన యువజన సంఘం ఆదర్శంగా తీసుకొని ముందుకు రావడం అభినందనీయమని హరీశ్‌రావు అభినందించారు. ఇక్కడ తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే దండం పెట్టాలని అనిపిస్తుందన్నారు. రేవంత్‌రెడ్డి మార్పు అని చెప్పి తెలంగాణ తల్లిని మార్చారని, తల్లిని మారిస్తే ఏమొస్తది అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెబుతున్న రేవంత్, కేసీఆర్ చేసిన అభివృద్ధి మార్చగలడా అని హరీశ్‌రావు అన్నారు.

తీగుల్ గ్రామం ఉద్యమాల పురిటిగడ్డ అని, ఇక్కడ 2001 నుంచి ఒక్కటే గులాబీ జెండా ఎగిరిందని హరీశ్‌రావు అన్నారు. ఉద్యమ సమయం నుంచి రాష్ట్ర ఆవిర్భావం వరకు ముందుండి నడిపించిన తీగుల్ గ్రామంపై ఎప్పుడూ తమకు ప్రేమ ఉంటుందని హరీశ్‌రావు అన్నారు. అందుకే ఈ గ్రామం నుంచి ఎవరు వచ్చినా అడిగింది కాదనకుండా అన్ని పనులు చేసినట్లు తెలిపారు. జీపీ భవనం, డబుల్ రోడ్డు, సర్కారు దవాఖాన, ఇలా చెప్పుకుంటూ పోతే అనేక అభివృద్ధి పనులు చేసుకున్నామని, సంక్షేమ కార్యక్రమాలు, పథకాలు అమలు చేసుకున్నట్లు హరీశ్‌రావు గుర్తుచేశారు.


తీగుల్‌లో ఎగిరేది గులాబీ జెండానే..


తీగుల్ గ్రామంలో ర్యాలీగా వస్తున్న హరీశ్‌రావు

కాంగ్రెస్ అంటేనే మోసం...

కాంగ్రెస్ అంటేనే మోసం చేసే పార్టీ అని ప్రజలకు తెలుసు అని, కానీ.. రేవంత్ రెడ్డి కళ్లబొల్లి మాటలు, మాయమాటలు నమ్మి ప్రజలు ఓటేశారని హరీశ్‌రావు అన్నారు. ప్రజల తలరాత మారుస్తా అని రేవంత్ మాటలు నమ్మి ఆయనన్ను గెలిపిస్తే ఇప్పుడు ఆగమయ్యిర్రు అన్నారు. కానీ, గజ్వేల్ ప్రజలు రేవంత్‌ను నమ్మలేదని, ఆయనకు ఓటేయ్యలేదని, బయట నియోజకవర్గాల ప్రజలు నమ్మి ఓటేసి ఇప్పుడు బాధపడుతున్నారని హరీశ్‌రావు అన్నారు. కానీ, ప్రజలు తొందరగానే రేవంత్ నైజం తెలుసుకున్నారని, ఇగ మాత్రం జన్మల కాంగ్రెస్ ఓటేయ్యం అంటుర్రు అని హరీశ్‌రావు అన్నారు. రేవంత్ మాటలు నాలుగు నెలల్లోనే ప్రజలకు అర్థమయ్యిందని, కేసీఆర్ ఉన్నప్పుడు భూముల విలువ ఎట్లుండే, ఇప్పుడు ఎట్లుంది అన్నారు. భూములు కొనేటోడు లేడని, అమ్మేటోడు లేడని, హైదరాబాద్ నుంచి భూములు కొనేందుకు ఏమన్నా కార్లు వస్తున్నయా, ఎవరన్నా భూములు కొనేందుకు సిద్ధంగా ఉన్నారా అని హరీశ్‌రావు అన్నారు. ఎవరన్నా పెండ్లికో, ఆపతికి సంపతికి భూమి అమ్ముతామంటే కొనేటోడు ప్రస్తుతం లేడని, దీంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈగలు కొట్టుకుంటున్నారని, ఇవ్వన్నీ రేవంత్ చేపట్టిన తుగ్లక్ పాలనతోనే రాష్ట్రం ఆగమైనట్లు హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రం దివాళా దీపిస్తుండని, ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, కేసీఆర్ హయాంలో కోటి రూపాయలకు ఎకరం ఉన్న జాగ, ఇప్పుడు రూ.60, 70 లక్షలకు ఇస్తమన్నా కొనేటోళ్లు లేరు అని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ హయాంలో ఇండ్లు కడితే, ఇప్పుడు ఇండ్లు కుదవపెట్టి అప్పులు తెచ్చుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ రాష్ట్ర గౌరవాన్ని నిలవెడితే.. రేవంత్ పడకొడుతుండన్నారు. మునిగడప ప్రాంతంలో కేసీఆర్ హయాంలో 400 ఎకరాల్లో ఇండస్ట్రీ పెట్టి ఉద్యోగాలు ఇవ్వాలే అనుకున్నారని, కానీ.. రేవంత్ దాని ఊసే పట్టడం లేదన్నారు. జగదేవపూర్‌లో రాబోయే రెండు మూడేండ్లలో పెద్దఎత్తున ఇండస్ట్రీలు పెట్టి యువతకు కచ్చితంగా ఉద్యోగాలు కల్పిస్తామని హరీశ్‌రావు హామీ ఇచ్చారు. రేవంత్ పాలన అందరికీ అర్థమైందని, ఇప్పటికైనా ప్రజలు గమనించాలే అని, పచ్చి అబద్ధాలు ఆడుతూ పబ్బం గడుపుతున్న రేవంత్‌కు, ఆయన ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హరీశ్‌రావు అన్నారు.

కేసీఆర్ హయాంలో ఎట్లుండే..

ఆయనవి మాటలు ఎక్కువ.. పని తక్కువ అని ప్రజలు అర్థం చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణ తల్లిని మారిస్తే ప్రజలకు ఒరిగేదేముంది అని హరీశ్‌రావు ప్రశ్నించారు. రైతులకు వానకాలం రైతుభరోసా ఇయ్యలేదని, యాసంగి రైతుభరోసా రెండెకరాలకు ఇచ్చి నాన్చుతున్నారని, రుణమాఫీ ఏగ్రామంలో కూడా పూర్తిగా చెయ్యలేదని హరీశ్‌రావు విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వడ్ల కొనుగోలులో తరుగు తీస్తుండ్రు అని మొత్తుకున్న రేవంత్, ఇప్పుడు 7, 8కిలోల తరుగు తీస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. సన్న వడ్లకు బోనస్ ఇస్తనని చెప్పిన మాటలు బోగస్ అయ్యాయని, రేవంత్ రూ. 1100 కోట్ల బోనస్ డబ్బులు బకాయి పడ్డాడని హరీశ్‌రావు విమర్శించారు. మహిళలకు ఏం చేయలే, యువకులకు ఏం చేయలే, అధికారంలో కి వచ్చిన వెంటనే 2లక్షలు ఉద్యోగాలు ఇస్తానని చెప్పి పది వేల ఉద్యోగాలిచ్చి, అన్నీ ఇచ్చినం అని అబద్ధాలు చెబుతున్నట్లు విమర్శించారు. రేవంత్ ప్రభుత్వంలో ఏది కొన ఎల్తలేదని, ఏది మొదలుపెట్టినా కొన ఎల్లిందా అని హరీశ్‌రావు ఎద్దేవా చేశారు.

కాంగ్రెసోళ్లకే పథకాలు...

కాంగ్రెస్ హయాంలో ప్రజలకు పథకాలు అందడం లేదని, కాంగ్రెస్ కార్యకర్తలకే రాజీవ్ యువవికాసం, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నారని హరీశ్‌రావు ఆరోపించారు. కాంగ్రెస్ నాయకుల జేబులు నింపేందుకు రేవంత్ పథకాలు పెట్టారని, కానీ.. కేసీఆర్ హయాంలో ప్రజలందరికీ అన్ని పథకాలు అందాయని, పార్టీలకు అతీతంగా పథకాలు మంజూరు చేసినట్లు తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, రైతుబీమా, ఇలా అన్ని పథకాలు అర్హులందరికీ అందించినట్లు గుర్తుచేశారు, రేవంత్ హయాంలో బీసీబంధు, దళితబంధు, గొర్రెల పంపిణీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలు, అన్నీ బంద్ అయినట్లు హరీశ్‌రావు విమర్శించారు.

ఆదర్శం బాల్‌రెడ్డి టీచర్...

తీగుల్ గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డి అందరికీ ఆదర్శంగా నిలిచారని మాజీమంత్రి హరీశ్‌రావు కొనియాడారు. రిటైరైన 20 ఏండ్ల నుంచి పైసా తీసుకోకుండా ఆయన విద్యార్థులకు ఉచితంగా పాఠాలు బోధిస్తున్నారని, ఇంతటి గొప్ప చరిత్ర కలిగిన గ్రామం తీగుల్ అని అన్నారు. ఆయన్ను హరీశ్‌రావు శాలువాతో ఘనంగా సన్మానించారు. తీగుల్‌లో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువసేనా యూత్ ఆధ్వర్యంలో నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయానికి అవసరమైన గ్రానైట్, ఫర్నిచర్ తన సొంత డబ్బులతో ఇవ్వనున్నట్లు హరీశ్‌రావు ప్రకటించారు. ఈ గ్రామానికి చెందిన సాంస్కృతిక కళాకారుడు పూసలి శ్రీను దళితరత్న డాక్టరేట్ పొందడంతో శాలువాతో హరీశ్‌రావు సన్మానించారు. జగదేవపూర్ మాజీ ఎంపీపీ బాలేశంగౌడ్ కాంగ్రెస్ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనకు మాజీ మంత్రి హరీశ్‌రావు కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అంతకుముందు గ్రామంలో ర్యాలీగా వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావు, నాయకులకు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, తీగుల్ మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, జడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ బాలేశంగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ రంగారెడ్డి, కొండపోచమ్మ దేవాలయ కమిటీ మాజీ చైర్మన్లు శ్రీనివాస్ రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, గ్రామ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎక్బాల్, మండల మహిళా విభాగం అధ్యక్షురాలు కవిత, ఎల్లారెడ్డి యువసేన అధ్యక్షులు ప్రకాశ్, ఎల్లయ్య, కోటయ్య, కనకయ్య, నాగరాజు పాల్గొన్నారు.


బీఆర్ఎస్‌లో చేరిన మాజీ ఎంపీపీ బాలేశంగౌడ్‌కు కండువా వేసి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు


తీగుల్ గ్రామ విశ్రాంత ఉపాధ్యాయుడు బాల్‌రెడ్డిని సన్మానిస్తున్న హరీశ్‌రావు

కరెంట్ తిప్పలైతంది సారూ..

హరీశ్‌రావుతో గోడు వెళ్లబోసుకున్న రైతు

గజ్వేల్, జూన్ 1: కరెంట్ తిప్పలైతంది సారూ... కరెంట్ సరిగ్గా ఇస్తలేరు... ఎప్పుడొస్తుందో ఎప్పుడు పోతుందో తెలుస్తాలేదని సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం తునికిమక్తా గ్రామానికి చెందిన రైతు పసుల కిష్టయ్య మాజీమంత్రి హరీశ్‌రావుతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. తునికిమక్తా గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చాకలి కనకయ్య మేలో ఎల్కతుర్తిలో జరిగిన రజతోత్సవ సభకు వెళ్లి తిరిగి వస్తూ ప్రమాదంలో మృతిచెందాడు. ఆ కుటుంబానికి రూ.5లక్షల చెక్కును అందజేసిన అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతుండగా, అదే గ్రామానికి చెందిన రైతు పసుల కిష్టయ్య కరెంట్ సక్కగా ఇయ్యక మోటర్లు కాలిపోతున్నాయని, కేసీఆర్ ఉండగా గిన్నిసార్లు పోలేదని చెప్పుకొచ్చాడు. నీళ్లున్నయని బోరేసుకొని వరి ఎసుకుంటే, కరెంట్ వచ్చిపోవుడుకు మోటర్లు కాలి పోతున్నయని, సింగిల్ ఫేజ్ ఇచ్చి మళ్ల కొద్దిసేపటికే త్రీఫేజ్ ఇచ్చే సరికి మోటర్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు. మోటర్లు కాలిపోతే రైతులు ఎడుస్తుర్రని, రోజుకు నాలుగైదు సార్లు కరెంట్ పోతున్నదని, కేసీఆర్ ఉండగానే బాగుండే, ఇప్పుడేమో కరెంట్ తిప్పలకు రైతులు ఆగం అవుతున్నరని హరీశ్‌రావుతో రైతు గోడువెళ్లబోసుకున్నాడు.

రైతు పసుల కిష్టయ్యతో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

డంపుయార్డు ఏర్పాటు విరమించుకోవాలి

గుమ్మడిదలలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న నల్లవల్లి రైతు జేఏసీ నాయకులు

గుమ్మడిదల, జూన్ 1: సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలంలోని నల్లవల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ప్యారానగర్ అటవీ ప్రాంతంలో జీహెచ్ఎంసీ డంపింగ్‌యార్డు ఏర్పాటును వ్యతిరేకిస్తూ గుమ్మడిదలలో జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్ష కొనసాగుతున్నది. ఆదివారం సైతం నిరాహార దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఇక్కడి గ్రామాల్లో వ్యవసాయమే జీవనాధారంగా ప్రజలు బతుకుతున్నట్లు తెలిపారు. డంపింగ్ యార్డు ఏర్పాటుతో నల్లవల్లి, కొత్తపల్లి, ప్యారానగర్, నాగిరెడ్డిగూడెం, లక్ష్మాపూర్‌తో పాటు ఇక్కడి తండాల్లో పర్యావరణం దెబ్బతినే ప్రమాద ఉందన్నారు. గొలుసుకట్టు చెరువులు కాలుష్య కాసారంగా మారే అవకాశం ఉందన్నారు. వ్యవసాయం కుంటుపడి ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాము రెండు నెలల క్రితం డంపింగ్‌యార్డు వద్దని ప్రజాభిప్రాయ సేకరణ చేసి అర్జీలు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే డంపింగ్ యార్డును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డంపింగ్‌యార్డు ఏర్పాటును విరమించుకునే వరకు నిరాహార దీక్షలు కొనసాగిస్తామని జేఏసీ నాయకులు తేల్చిచెప్పారు. దీక్షలో రైతు జేఏసీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

సమీకృతం.. పిల్లర్లకే పరిమితం

- సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తయ్యేనా
- అమీన్‌పూర్‌లో పిల్లర్లకే పరిమితమైన నిర్మాణం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు

పటాన్‌చెరు, జూన్ 1: ప్రజలకు కూరగాయలు, పండ్లు, మాంసం, పూలు, అన్ని ఒకేచోట దొరికేలా బీఆర్ఎస్ ప్రభుత్వం సమీకృత వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అమీన్‌పూర్‌లో మున్సిపల్ అధికారులు టెండర్లు వేసి భవన నిర్మాణ పనులు కాంట్రాక్టర్లకు అప్పగించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిపోవడంతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల పనులు మధ్యలో నిలిచిపోయాయి. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్‌లో పరిధిలో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ పనులు పిల్లర్ల స్థాయిలో ఆగిపోయాయి. అసంపూర్తిగా ఆగిన పనులు పూర్తిచేసేందుకు ప్రస్తుత పాలకులు చర్యలు తీసుకోవడం లేదు. అమీన్‌పూర్‌లో విశాలమైన స్థలంలో సుమారు రూ. రెండు కోట్లతో వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణానికి బీఆర్ఎస్ హయాంలో పనులు ప్రారంభించారు. ఈ మార్కెట్ అందుబాటులోకి వస్తే పట్టణ ప్రజలకు మాంసం, చికెన్, చేపలు, కూరగాయలు, పూలతో పాటు పలు రకాల నిత్యావసర సరుకులు ఒకే దగ్గర లభించడంతో సౌకర్యంగా ఉంటుంది. అమీన్‌పూర్ హైదరాబాద్‌కు సమీపంలో ఉండడంతో ఎక్కువ మంది ఐటీ ఉద్యోగులు ఇక్కడ నివాసం ఉంటున్నారు. కూరగాయలు, మాంసం, ఇతర వస్తువులు కావాలంటే వారంతా రామచంద్రాపురం, శేరిలింగంపల్లి, పటాన్‌చెరుకు వెళ్లాల్సి వస్తున్నది. మున్సిపల్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కావడం లేదని తెలిసింది.

వెంటనే పూర్తిచేయాలి..

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో సమీకృత మార్కెట్ పనులు వెంటనే పూర్తిచేయాలి. మార్కెట్ ప్రజలకు అందుబాటులో ఉండేందుకు మాజీ మంత్రి హరీశ్‌రావు అప్పట్లో మార్కెట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ పనులు పూర్తిచేయడంపై శ్రద్ధ పెట్టడం లేదు. ఎమ్మెల్యే, అధికారులు స్పందించి పనులు పూర్తిచేయించాలి. అమీన్‌పూర్ ప్రాంతంలో లక్షలాది మంది జీవిస్తున్నారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాలి.
–ఐలాపూరం మాణిక్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకుడు

అమీన్‌పూర్ మున్సిపాలిటీలో అసంపూర్తిగా ఆగిన సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు

వాహనాలు ఇలా.. వెళ్లేదెలా

గుమ్మడిదల, జూన్ 1: బొంతపల్లి పారిశ్రామికవాడలో రోడ్డుకు ఇరువైపులా భారీ వాహనాలు ఇష్టారాజ్యంగా పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి పారిశ్రామికవాడలోని గ్రాన్యుల్ ఇండియా పరిశ్రమకు చెందిన భారీ వాహనాలు నిబంధనలకు విరుద్ధంగా నిత్యం దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఆదివారం బొంతపల్లి వీరభద్రస్వామి ఆలయానికి వచ్చిన భక్తులతో పాటు పరిశ్రమల్లో విధులకు వచ్చే కార్మికులకు, వాహనదారులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రమాదాలు సైతం చోటుచేసుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సంగారెడ్డి జిల్లా బొంతపల్లి పారిశ్రామికవాడలో ఓ పరిశ్రమకు చెందిన భారీ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేసిన దృశ్యం